క్లుప్తంగా

చేతుల శుభ్రతతో రోగాలకు చెక్



కేజీబీవీలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూడేరు: స్థానిక కేజీబీవీలో గురువారం చేతుల శుభ్రతపై విద్యార్థినులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. చేతుల పరిశుభ్రతతో రోగాలు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని ఏఎస్ఎం చంద్రకళ తెలియజేశారు. చేతి వేళ్ల గోళ్లు పెరగకుండా ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలన్నారు. చేతులను శుభ్రం చేసుకోకుండా భోజనం చేస్తే భోజనంతో పాటు దుమ్ము, మలినాలు కడుపులోకి పోయి రోగాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జేఎస్‌డీ, డీడీఈఓ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో పీఎంకేవై మొదటి విడతలో భాగంగా జూనియన్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమో, బీటెక్, ఎంబీఏ, ఎంకామ్ విద్యార్హత గల వారు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని పాలిటెక్నిక్ కళాశాలలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9182920381, 9010222165 సంప్రదించాలన్నారు.

బాలికల భద్రత అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ వనజా అక్కమ్మ

శెట్టూరు: బాలికల భద్రత బాధ్యత అందరిదీ అని సీడీపీఓ వనజాఅక్కమ్మ, ఎంఈఓ శ్రీధర్, ఏటీఎల్ ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని యాటకల్లు గ్రామంలోని ఉన్న పాఠశాలలో ఆర్డీటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలను అరికడదాం – ఆడబిడ్డలను కాపాడుదాం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియజేశారు. బాలకార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులు వంటి అంశాలపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని 74వీరాపురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రంగచేడుకు చెందిన ట్రాక్టర్ యజమాని ఎర్రిస్వామిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం: మండలంలోని పాలవాయి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న చిన్నారులతో గురువారం అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలో ఈ ఏడాది కొత్తగా చేరే చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. నాలుగేళ్ల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ నుంచి 12 మంది చిన్నారులను ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీ స్థాయికి పంపించారు. అనంతరం గర్భిణులు, మహిళలకు మహిళల చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఏడబ్ల్యూడబ్ల్యూఎస్ లక్ష్మి, రాధా, ఆయా, పలువురు పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆంధ్ర,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు.

నకిలీ పురుగు మందులతో జాగ్రత్త

కొనుగోలు సమయంలో అవగాహన అవసరం

- మందులకు రశీదు తప్పనిసరి
- అన్నదాతలకు అధికారుల సూచన



కుందుర్పిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

కుందుర్పి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈతరుణంలో పంట పొలాలకు ఎరువులు అధికంగా వినియోగిస్తారు. దీంతో మార్కెట్లలోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండు సార్లు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు పురుగు మందులు తీసుకోవాలని, లేందటే నిలువునా మోసపోయే అవకాశం ఉందని తెలిపారు.

దళారుల వద్ద మందులు కొనుగోలు చేయరాదు..

నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోతారని వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అధికారులు సూచిస్తున్నారు. ఎరువుల వ్యాపారులు పంట దిగుబడి అధికంగా వస్తోందని నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల వారు కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉందని సూచించారు. అదేవిధంగా అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదన్నారు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తారని, వాటిని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బ తింటోదన్నారు. మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా? అన్న విషయాలను రైతులు తెలుసుకోవాలి. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన తర్వాత తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలి.

నకిలీ ఎరువులని తెలిస్తే ఫిర్యాదు చేయండి

దుకాణాలు లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీనీ గుర్తించి ఏకంపెనీ, ఏరకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని డీలర్‌తో సంతకాలతో కూడిన బిల్లును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించి సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై సత్వరం రైతులు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేసి, రైతులకు న్యాయం జరగడానికి అవకాశ ముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు పురుమందు విక్రయిస్తున్నట్లు తమ పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతుకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లును రైతుకు అందజేయాలి. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేదంటే పంటలు దెబ్బ తినే అవకాశం ఉంది.

– ఏడీఏ, యల్లప్ప, కళ్యాణదుర్గం

ఎస్ఐ ఆంజనేయులుకు ఎస్పీ ప్రశంస



ఎస్పీ గౌతమిశాలి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ ఆంజనేయులు

కంబదూరు: కంబదూరు ఎస్ఐ ఆంజనేయులను జిల్లా ఎస్పీ గౌతమీశాలి గురువారం అభినందించారు. ఎస్ఐ ఆంజనేయులు మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐకు జిల్లా ఎస్పీ గౌతమీశాలి ప్రశంసాపత్రం అందించారు.

ఎంఈఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

కళ్యాణదుర్గం: మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో జరిగిన సమావేశంలో ఎన్నికల పరిశీలకులుగా ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం తాలూకా ఎంఈఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా ఎంపీ ఎర్రిస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎనుముల చిరంజీవి, కోశాధికారిగా మహేష్‌ను ఎన్నుకున్నారు. ఎంఈఎఫ్ బలోపేతానికి, సమస్యల పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామని నూతన సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, నాయకులు లక్ష్మన్న, హెచ్‌బీ రవిశంకర్, వార్డెన్ నాగరాజు, నగేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



కూడేరు: గాయపడిన దిలీప్

కూడేరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన దిలీప్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు బయల్దేరాడు. అదే సమయంలో మరుట్ల-1వ కాలనీకి చెందిన జగదీష్ అనే యువకుడు కూడేరుకు వస్తుండగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. గాయపడిన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఉరవకొండలో నీటి ఎద్దడిని నివారించండి

ఉరవకొండ: పట్టణంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని వెంటనే నివారించాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. గురువారం పట్టణంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై మంత్రి స్పందించి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హేసాన్‌బాషాతో ఫోన్‌లో మాట్లాడారు. ఉరవకొండలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని నివారించి, 21 వార్డులకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉరవకొండలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వార్డులకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు.

పంట పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అందిస్తామన్న పంట పెట్టుబడి సాయం రూ.20 వేలును వెంటనే రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ కోరారు. ఈ మేరకు గురువారం సీపీఐ రైతు సంఘం నేతలు కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ప్రసన్నకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రమణ, వెంకటేష్, ప్రసాద్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని బీసీవై పార్టీ రాయదుర్గం ఇన్‌చార్జ్ గౌని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 650 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికి 29 మంది ఉపాధ్యాయులు ఉండాలన్నారు. కేవలం 17 మంది మాత్రమే ఉన్నారన్నారు.

25 క్వింటాళ్ల కందుల పంపిణీ

కూడేరు: ప్రభుత్వం 30శాతం సబ్సిడీతో కందులు పంపిణీ చేస్తున్నట్లు ఏఈఓ శైలజ తెలిపారు. గురువారం 180 మంది రైతులకు 25 క్వింటాళ్ల కందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాల పరిధికి మొత్తం 50 క్వింటాళ్ల కందులను కేటాయించడం జరిగిందన్నారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాలు, అర్చనలు, మహా మంగళహారతి ఇచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది.

7న గాండ్ల సర్వసభ్య సమావేశం

అనంతపురం టవర్‌క్లాక్: అఖిల గాండ్ల, తెలికల సంక్షేమం కోసం జూలై 7న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస నగర్‌లోని బాలాజీ కళ్యాణ మండపంలో జరగనున్న సమావేశంలో కొత్త కమిటీలు ఏర్పాటు చేయనునట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి



శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ గూడెన్న

కణేకల్లు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని ఎంపీడీఓ గూడెన్న పేర్కొన్నారు. గురువారం కణేకల్లులోని మత్స్యకారుల కాలనీ, రామనగర్ తదితర కాలనీల్లో శానిటేషన్ పనులను ఎంపీడీఓ దగ్గరుండి చేయించారు. డ్రైనేజీల్లో వేస్ట్ ఆయిల్, ఆయిల్ బాల్స్ వేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అపరిశుభ్రతతో మలేరియా, డెంగీ లాంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. జ్వరాలతోపాటు డయేరియా కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. దోమలు, ఈగలు నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాఫర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంబదూరు మాజీ సర్పంచ్ నీలి నరసింహప్ప మృతి



నరసింహప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కంబదూరు పంచాయతీ మాజీ సర్పంచ్ నీలి నరసింహప్ప (94) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. నరసింహప్ప కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వృద్ధాప్యం మీదపడడంతో ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, నాయకులు విల్సన్, మల్లేష్, రాజు, పవన్, ఈడిగ హరి, ఓబుళపతి తదితరులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహప్ప కుమారుడు వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్పను నాయకులు ఓదార్చారు.

'స్టాప్ డయేరియా'పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరిదేవి

గుమ్మఘట్ట: స్టాప్ డయేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ గౌరిదేవి, పీహెచ్‌సీ వైద్యులు బాలాజీనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో స్టాప్ డయేరియాపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. డయేరియావల్ల ప్రాణ నష్టం జరగకుండా అందరూ సంయుక్తంగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సహకరించాలని కోరారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు ఆదిబయమ్మ, జయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇటుకుల పల్లయ్య, పెదయ్య స్వామి ఊరేగింపు



రాప్తాడులో స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు ఇటుకుల పల్లయ్య, పెదయ్య స్వాములను కురుబ కులస్తులైన గంజి, బులకొండ, చిరుతల, చిదగొండ, బుల్లె కాపులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. కనగానపల్లి పెదయ్య స్వామిని గత 20 సంవత్సరాలు, ఇటుకుల పల్లయ్య స్వామిని 8 సంవత్సరాల తర్వాత రాప్తాడులోకి కాపులు తీసుకుని రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గంజి, బులకొండ, చిరుతల, చిదగొండ కాపులు అనంతపురం రూరల్ మండలంలోని ఇటుకులపల్లిలో వెలసిన ఇటుకుల పల్లయ్య స్వామితో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి మండలంలోని అతగల్లు పట్నంలో వెలసిన పెదయ్య స్వామిని బుధవారం సాయంత్రం రాప్తాడుకు తీసుకువచ్చి కాపులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకే సారి రెండు దేవర్లు గ్రామానికి తీసుకురావడంతో బుధవారం రాత్రి కాపులు స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అదేవిధంగా మళ్లీ గురువారం సాయంత్రం కూడా గ్రామంలో కాపులు స్వాములను ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఊరేగింపు వేడుకలను తిలకించేందుకు మండలం నుంచే గాక ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో రాప్తాడులో వీధులు జనసంద్రమయ్యాయి. యువతులు, మహిళలు ప్రతి ఇంటి నుంచి స్వామికి బిందెలతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఊరేగింపు వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

బ్రాహ్మణుల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

అనంతపురం కల్చరల్: ఐక్యత లేక అభివృద్ధికి నోచుకోని బ్రాహ్మణ సంఘాలన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తామం. ఐక్యతతోనే బ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని సీనియర్ న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం రాత్రి బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 7న మొదటి రోడ్డు శివాలయంలో జరిగే అఖిల భారత బ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశం వివరాలు వెల్లడించారు. దశాబ్దాలుగా బ్రాహ్మణులు వేర్వేరుగా ఉంటున్నారని.. అందరినీ కలపడమే లక్ష్యంగా ప్రత్యేక సమావేశం జరుగుతోందన్నారు. 7న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అనంతరం బ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నామని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి



ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు



ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ-2 సాయికృష్ణ, ఉపాధ్యాయులు



ములకనూరులో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంబదూరు: బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు పరమేశప్ప, తిప్పేస్వామి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ములకనూరులో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఆరేళ్ల నుంచి 14 సంవత్సరంలో వయసున్న బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, హనుమంతరెడ్డి, జయలక్ష్మి, కళ్యాణి, చిత్తప్ప, శివానంద, సురేష్, మారుతి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. గురువారం మండలంలోని ఛాయాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం- 2 పరిధిలో అంగన్‌వాడీ బడిబాట, గ్రాడ్యుయేషన్‌డే, బాల్యవివా హాలను నిరోధించడం, సీజనల్ వ్యాధుల నివారణ, డయేరియాను అరికట్టడం, గృహహింస తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు సుల్తానా, కుళ్లాయమ్మ, పద్మావతి, సువర్ణమ్మ, శశికళ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

కూడేరు: ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు మండల విద్యాధికారి-2 సాయికృష్ణ అన్నారు. గురువారం 'నేడు బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా కూడేరులోని ఎమ్మార్సీ ఆవరణలోని ప్రాథమిక పాఠశాల పిల్లలు, ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ-2 సాయికృష్ణ గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతి రాణి, రాధిక, ఉమా సుమలత, సీఆర్పీలు రమణ, శివ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధిని నివారిద్దాం

- ఆర్‌బీఎస్‌కే జిల్లా మేనేజర్ రజితరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ రజితారెడ్డి

వజ్రకరూరు: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని రాష్ట్రీయ బాల శ్వాస్తియ కార్యక్రమ జిల్లా మేనేజర్ రజితరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాగులపాడులోని గిరిజన గురుకుల పాఠశాలలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆర్‌బీఎస్‌కే జిల్లా మేనేజర్ రజితరెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి సికిల్‌సెల్ ప్రబలిన గిరిజన ప్రాంతాల్లో 0 నుంచి 40 మధ్య వయసున్న ఏడు కోట్ల మందికి అవగాహన కల్పించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ నాగశంకర్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గార్లదిన్నె: ఖరీఫ్‌లో రైతులు ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి సూచించారు. గురువారం మండలంలోని కల్లూరు ఆర్బీకేలో రైతులకు పంటల సాగుపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని పంటలు సాగు చేసుకోవాలన్నారు. అలాగే భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. రసాయన ఎరువులు వాడితే భూమిలో కర్బన్ శాతం తగ్గి పోతుందన్నారు. దీంతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదన్నారు. ఒకే రకమైన పంటలు సాగు చేయడం వల్ల భూసారం తగ్గుతుందని, పంట మార్పిడి చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు.అనంతరం వరి, వేరుశనగ, కంది, ఆము దం ,పత్తి పంటలు సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం వ్యవసాయ శాఖ ఏడీ రవి, ఎఫ్‌టీసీ ఏడీఏ శైలజకుమారి, ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయకుమార్ మృతి బాధాకరం



డాక్టర్ నీలం విజయకుమార్ (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ నీలం విజయకుమార్ మృతిపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం ఓ సంతాపం తెలియజేశారు. కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు నీలం రాజశేఖర్ రెడ్డి పెద్ద కుమారుడైన డాక్టర్ నీలం విజయకుమార్ మరణం చాలా బాధాకరమన్నారు. సామా న్య ప్రజలకు ఎన్నో సేవలందించడంతో పాటు హైదరాబాద్‌లో నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు సహాయ సహకారాలందించారని గుర్తు చే శారు. రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారన్నారు.

ప్రతి పాఠశాల ఆదర్శంగా నిలవాలి

ఆత్మకూరు: మండలంలో ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాల ఆదర్శంగా నిలవాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో డయేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. డయేరియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా పాఠశాలలో అమలవుతున్న నేను బడికి పోతా, విద్యా ప్రవేష్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. విద్యా కానుక కిట్లను విద్యార్థులందరికీ అందజేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.